# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశం కోసం పని చేస్తున్నామనే భావన క్రమేపీ ప్రేరణగా మారుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ దేశ ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.
- ❖ భారత అంతరిక్ష కేంద్ర నిర్మాణ పనులు 2035 నాటికి పూర్తి అవుతాయని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ తెలియజేశారు.
- ❖ టోక్యోలో జరుగుతున్న 2025 డెఫ్ ఒలింపిక్స్ లో భారత షూటర్ ధనుష్ శ్రీకాంత్ స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు.

====================

దేశం కోసం పని చేస్తున్నామనే భావన క్రమేపీ ప్రేరణగా మారుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సూరత్‌లోని భారతదేశపు తొలి బుల్లెట్ రైల్ స్టేషన్ ను ప్రధానమంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు బృందంతో జరిపిన సమీక్షలో ప్రధాని సంభాషిస్తూ.. బుల్లెట్ రైల్ ప్రాజెక్టును భారతదేశ అంతరిక్ష ప్రయాణంతో పోల్చారు. ఆనాటి తొలి ఉపగ్రహ ప్రయోగం భారత్ అంతరిక్ష రంగానికి బీజం వేసి నేటి వందలాది ఉపగ్రహ ప్రయోగాలకు ఎలా కారణమయ్యిందో ఇప్పుడు చేపడుతున్న తొలి బుల్లెట్ రైల్ ప్రాజెక్ట్ కూడా భవిష్యత్ లో అద్భుత ప్రయోగాలకు నాంది అవుతుందని విశ్వసించాలన్నారు.

(వాయిస్ 29 సెకన్లు)

====================

జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. 1966 నవంబర్ 16 న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పాటయ్యింది. దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో బాధ్యతాయుతమైన పత్రికా వ్యవస్థ పాత్రను పత్రికా

దినోత్సవం తెలియజేస్తుంది. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన జాతీయ పత్రికా దినోత్సవ వేడుకల్లో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్, ఆ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ జస్టిస్ రంజనా ప్రకాష్ దేశాయ్ కూడా పాల్గొన్నారు. అనంతరం అశ్విని వైష్ణవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... దేశ ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. పత్రికా వ్యవస్థ విశ్వసనీయతను ఎలా బలోపేతం చేయాలి? అసత్య సమాచార వ్యాప్తిని ఎలా కట్టడి చేయాలనే అంశాలపై ఈరోజు చర్చించామని అశ్విని వైష్ణవ్ వెల్లడిస్తూ..

(వాయిస్ 27 సెకన్లు)

===================

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు మరో ఏడు ప్రయోగాలు లక్ష్యంగా పెట్టుకుందని ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. వీటిలో ఒక వాణిజ్య కమ్యూనికేషన్ ఉపగ్రహ ప్రయోగం కూడా ఉందని వెల్లడించారు. వీటిలోనే పీఎస్ఎల్వీ, గగన్‌యాన్ మిషన్లు ఉన్నాయని, స్వదేశీ సాంకేతికత సహాయంతో తయారు చేసిన పీఎస్ఎల్వీ ప్రయోగం కూడా ఇందులో ఉందన్నారు. బెంగళూరులో ఆయన ఈరోజు పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ లో మాట్లాడుతూ.. చంద్రయాన్-4 మిషన్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. చంద్రుడి నుంచి మట్టి నమూనాలను భూమికి తీసుకురావడమే దీని లక్ష్యమన్నారు. భారత అంతరిక్ష కేంద్ర నిర్మాణ పనులు మొదలయ్యాయని, వీటిని 2035 నాటికి పూర్తి చేయనున్నట్లు ఇస్రో ఛైర్మన్ తెలియజేశారు.

===================

మాహే శ్రేణి యాంటీ - సబ్‌మెరైన్ యుద్ధ నౌక భారత నావికాదళంలోకి నవంబర్ 24న ప్రవేశించనుంది. ఈ నౌక 80 శాతానికి పైగా స్వదేశీ సాంకేతికతతో నిర్మితమయ్యింది. యుద్ధనౌకల రూపకల్పన, నిర్మాణంలో పెరుగుతున్న భారతదేశపు నైపుణ్యాన్ని ఇది ప్రదర్శిస్తుంది. ఈ నౌక జలాంతర్గాములను ఛేదించేందుకు, తీరప్రాంత గస్తీని నిర్వహించేందుకు రూపొందించబడింది. ఈ మాహేశ్రేణి యుద్ధనౌక రూపకల్పన ఆత్మ నిర్భర్ భారత్ చొరవ అత్యాధునిక దశను సూచిస్తోంది.

విరామం

===================

భారత్ - ఖతార్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, నూతన అవకాశాల అన్వేషణకు ఖతార్ మార్గదర్శకత్వాన్ని భారత్ విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ స్వాగతించారు. ఖతార్ లో పర్యటించిన ఆయన మధ్య ప్రాచ్య దేశాలు, పశ్చిమాసియా అభివృద్ధి వంటి ప్రపంచ సమస్యలపై దోహాలో ఖతార్ ప్రధాన మంత్రి మొహమ్మద్ బిన్ అబ్దుల్ రెహమాన్ అల్ థానితో సమావేశమయ్యారు. వాణిజ్యం, పెట్టుబడి, నూతన ఆవిష్కరణలు వంటి కీలక అంశాలపై ఇరు దేశాల మధ్య చర్చలు జరిగాయని జైశంకర్ సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు.

===================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 28వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

===================

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఈరోజు జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. తుమాల్‌పాడ్ ప్రాంతంలోని అడవిలో మావోయిస్టులు ఉన్నట్లు నిఘా వర్గాల సమాచారం మేరకు డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ బృందం అక్కడికి చేరుకొని సెర్చ్ ఆపరేషన్ చేపట్టగా మావోయిస్టులు ఎదురుకాల్పులకు దిగారు. దీంతో ఈరోజు ఉదయం నుంచి భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. ఆ ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను సంఘటనా స్థలం నుంచి స్వాధీనం చేసుకున్నామని, వారిపై మొత్తం 15 లక్షల రూపాయల రివార్డు ఉందని బస్తర్ రేంజ్ ఐజిపి పి. సుందర్ రాజ్ తెలిపారు. ఘటనా స్థలం నుంచి రైఫిల్, బిజిఎల్ లాంచర్లు, పేలుడు పదార్థాలు, ఇతర ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదనపు పోలీసు బృందాలను ఆ ప్రాంతానికి తరలించామని సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని వెల్లడించారు.

===================

భారతదేశం నుండి అమెరికా దిగుమతి చేసుకుంటున్న కొన్ని ఆహార పదార్థాలపై ఆ దేశ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ సుంకాలను తగ్గించారు. ఈ చర్య వల్ల భారతదేశపు మామిడి, దానిమ్మ, టీ ఎగుమతులు ప్రయోజనం పొందే అవకాశం ఉంది. పరస్పర సుంకాల ప్రభావం లేని దిగుమతులలో ఉష్ణమండల పండ్లు, రసాలు, సుగంధ ద్రవ్యాలు ఉన్నాయని వైట్ హౌస్ ప్రకటించింది. ట్రంప్ గతంలో భారత్ నుండి చేసుకుంటున్న దిగుమతులపై 25 శాతం పరస్పర సుంకాలను విధించారు. రష్యన్ చమురు కొనుగోలు కారణం చూపి అదనంగా మరో 25 శాతం సుంకాన్ని జోడించారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి ట్రంప్ గతంలో జెనరిక్ మందులను సుంకాల నుండి మినహాయించారు. దీనివల్ల అమెరికాలో సూచించిన జెనరిక్ మందులలో 47 శాతం సరఫరా చేసేందుకు భారతదేశానికి మార్గం సుగమం అయ్యింది.

===================

ఉత్తరప్రదేశ్ సోన్‌భద్ర జిల్లాలో నిన్న చోటు చేసుకున్న గని ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, 12 మందికి పైగా కార్మికులు చిక్కుకున్నారని అధికారులు తెలిపారు. వారిని రక్షించడానికి NDRF, SDRF, స్థానిక సహాయక బృందాలు యుద్ధ ప్రాతిపదికన పని చేస్తున్నాయి. సీనియర్ అధికారులు ఘటనా స్థలంలో ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఓబ్రాలోని బిల్లీ మార్కుండి గ్రామంలో ఉన్న కృష్ణ మైన్స్ క్వారీ లోపల గోడ అకస్మాత్తుగా కూలిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని అదనపు డీజీపీ పియూష్ మోర్డియా పాత్రికేయులకు వెల్లడించారు.

===================

టోక్యోలో జరుగుతున్న 2025 డెఫ్ ఒలింపిక్స్ లో భారత షూటర్ ధనుష్ శ్రీకాంత్ స్వర్ణ పతకాన్ని ఈరోజు గెలుచుకున్నాడు. ఎయిర్ రైఫిల్ విభాగంలో 252.2 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని వరుసగా రెండవ సారి కైవసం చేసుకున్నాడు. ఇక మహిళల ఎయిర్ రైఫిల్ విభాగంలో మహిత్ సంధు, కోమల్ వాఘ్మారే రజత, కాంస్య పతకాలను సాధించారు.

===================

శ్రీలంకలోని కొలంబో వేదికగా జరుగుతున్న అంధుల మహిళల టీ-20 ప్రపంచ కప్ మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్ పై విజయం సాధించింది. పాకిస్థాన్ నిర్దేశించిన 136 పరుగుల లక్ష్యాన్ని కేవలం 10 ఓవర్లలో 2 వికెట్లను మాత్రమే కోల్పోయి భారత్ ఛేదించింది. దీంతో ఈ టోర్నమెంట్‌లో వరుసగా ఐదవ విజయాన్ని నమోదు చేసింది.

===================

దేశంలోని తూర్పు ఈశాన్య ప్రాంతాలలో రానున్న రెండు, మూడు రోజుల వరకూ శీతల పరిస్థితులు కొనసాగుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది.

====================

====================